

ప్రపంచ సుందరి కిరీటమే లక్ష్యం

స్టార్ టీన్ గ్లోబ్-2024 ప్రపంచ సుందరి కిరీటం సాధించడమే లక్ష్యమని స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా విజేత సంజన తెలిపారు. - 10లో



పోలీసులకు మంత్రుల పరామర్శ

బాబు పర్యటనలో గాయపడి చికిత్స పొందుతున్న పోలీసులను మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి పరామర్శించారు. - 10లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	38	26
చిత్తూరు	37	25
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	38	26

న్యూస్‌రీల్

పక్కాగా ఓట్ల లెక్క

తిరుపతి అర్బన్: 'ఓటర్ల లెక్క పక్కాగా ఉండాలి..లెక్క తప్పితే చర్యలు తీవ్రంగా ఉంటాయి' అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ డీకే బాలాజీతో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీకి ప్రతి ఇంటికీ బీఎల్‌వోలు వెళ్లి ఓటర్ల సవరణ జాబితాను తయారు చేయాలన్నారు. బీఎల్‌వోలు తప్పులు చేస్తే ఈఆర్‌ఓలు బాధ్యత వహించాలన్నారు. ఓట్లు తొలగించాల్సి వస్తే పక్కా ఆధారాలు ఉండాలని స్పష్టం చేశారు. ఈఆర్వోలు హరిత, కనక నరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, శ్రీనివాసులు, చంద్రముని పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమహాలక్ష్మి యాగం



యాగశాలలో యజ్ఞధారణ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ వద్ద ఏర్పాటుచేసిన యాగశాలలో శనివారం శ్రీమహాలక్ష్మి మహాయాగాన్ని ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణం, ప్రజల సుభిక్షం కోసం ఝులారియా పీఠాధిపతి ఘన్‌షాయాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీమహాలక్ష్మి మహాయాగం శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యాగశాలలో ఏర్పాటు చేసిన 225 కుండాల యజ్ఞాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేద పండితులు శాస్త్రోక్తంగా యజ్ఞధారణలు, వేదపారాయణం, సహస్ర నామ పారాయణం చేపట్టారు. 225 దంపతులచే శ్రీమహాలక్ష్మి, విష్ణు సహస్ర నామ పారాయణం చేయించారు. మధ్యాహ్నం శ్రీకన్వెన్షన్ హాల్లో కైలాస్ చంద్రస్వామిజీ చేపట్టిన శ్రీమద్ భాగవత ప్రవచనం ఆకట్టుకుంది. కో ఆర్డినేటర్ గిరిధర్ కుమార్, సంజయ్, మధుసూదన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా గంజి మహోత్సవం



గంజి ఊరేగింపులో మహిళా భక్తులు

తిరుపతి కల్చరల్: తిమ్మినాయుడుపాళెం మాతమ్మ మాదిగ వాడలో మేల్ మరవత్తూరు ఆదిపరాశక్తి అమ్మవారి గంజి మహోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి సంఘం జిల్లా అధ్యక్షుడు టీ.గంగాధరం ఆధ్వర్యంలో అమ్మవారి గంజి ఉత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, గంజి ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించారు. చిరంజీవి, రాజగోపాల్, చెంగల్‌రాయులు, విజయ్ పాల్గొన్నారు.

శ్రీహరి కరుణ





భూమన కరుణాకరరెడ్డి

ఆ కలియుగ వేంకటేశ్వరుడికి సేవచేసే భాగ్యం దక్కడం అత్యంత అరుదు. అదే రెండో పర్యాయం ఆ స్వామికి సేవ చేయడమంటే నిజంగా అదృష్టమే. అది ఆ శ్రీహరి కరుణే! ఈ అరుదైన అవకాశం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి దక్కింది. ఆయనను టీటీడీ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో భూమన టీటీడీ చైర్మన్‌గా నియమితులవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- టీటీడీ చైర్మన్‌గా మరో మారు ఎమ్మెల్యే భూమన నియామకం
- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- గత సంస్కరణలను నెమరు వేసుకుంటున్న స్థానికులు

తిరుమల: తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మరోమారు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుతం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పదవీకాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఆయన స్థానంలో ప్రస్తుత తిరుపతి ఎమ్మెల్యేగా ఉన్న భూమన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా భూమన చేతికి టీటీడీ పగ్గాలు రావడం ఇది రెండోసారి. 2006–2008 మధ్య కాలంలో టీటీడీ చైర్మన్‌గా కొనసాగారు.

సంస్కరణలకు మారుపేరు భూమన

గతంలో భూమన కరుణాకరరెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చి టీటీడీ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేశారు. ఇందులో కొన్ని విశేష ఆదరణ పొంది దేశవిదేశాల్లోనూ ప్రత్యేక గుర్తింపుని సంపాదించుకున్నాయి. అందులో మచ్చుకు కొన్ని..

- దళిత గోవిందం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అసమానతలు, అంటరానితనాన్ని నిర్మూలించడానికి భూమన నడుంబిగించారు. దళితవాడల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించి దేవుడి వద్ద అందరూ సమానమనే భావన సమాజానికి చాటిచెప్పారు.
- కల్యాణోత్సవాలు సైతం నిర్వహించారు. అప్పట్లో ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివాహం చేయలేని స్థితిలో ఉన్న శ్రీవారి భక్తుల పిల్లల కోసం కల్యాణమస్తు అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసి ఏడాదిలోపు చంటి పిల్లలు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా శ్రీవారి దర్శనం కల్పించారు.
- శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటేలా 2007లో ఎస్వీబీసీ భక్తి చానల్‌ను స్థాపించారు. ఇది దినదినాభివృద్ధి చెంది ప్రస్తుతం నాలుగు భాషల్లో భక్తులకు శ్రీవారి వైభవాన్ని ప్రసారం చేస్తోంది.
- చైతన్య రథయాత్ర, ఎస్వీబీసీ చానల్ ఏర్పాటు, విద్యాధన పథకం, టీటీడీ స్కూల్ పిల్లలకు ఉచిత పుస్తకాలు, మహిళా క్షురకులు, షెడ్యూల్ కులాలకు చెందిన వారికి అర్చకులుగా ట్రైనింగ్, ఉచిత లడ్డూ, శ్రవణం ప్రాజెక్ట్, పీఠాధిపతులతో ధార్మిక సదస్సులు, రాజంపేట సమీపంలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఇలా.. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు.

అరుదైన అవకాశం



దివంగత సీఎం వైఎస్సార్‌తో భూమన



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భూమన

ముఖ్యమంత్రులైన తండ్రీకొడుకుల వద్ద టీటీడీ చైర్మన్‌గా కొనసాగే అరుదైన అవకాశం భూమనకు దక్కింది. ఆయన వైఎస్ కుటుంబానికి అత్యంత ఆప్తుడు. ప్రజాప్రస్థానం పేరుతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పాదయాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. 2006 నుంచి రెండేళ్లపాటు టీటీడీ చైర్మన్‌గా కొనసాగారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈనేపథ్యంలో 2012 ఉప ఎన్నికల్లో.. 2019 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున తిరుపతి నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనపై నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు టీటీడీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు.

కాలుష్యాన్ని అరికడదాం



వాహనాల ప్రారంభంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తిరుపతి అర్బన్: వాహనాల కాలుష్యం ప్రమాదకరం.. కలసికట్టుగా అరికట్టడానికి అంతా విద్యుత్ వాహనాల కొనుగోలుకు మొగ్గుచూపాలని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నెడ్‌క్యాప్ సంస్థ ద్వారా గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన వాహనాల ప్రదర్శనలో పలువురు వాహనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు హాజరయ్యారు. విద్యుత్ స్కూటర్లను వారు నడిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగాలను అందరూ తెలుసుకోవాలన్నారు. ఏథర్ ఎనర్జీ, టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్, ఎంఈడబ్ల్యూ ఎలక్ట్రికల్స్, అవెరా ఏఐ మొబిలిటీ, బీఎస్‌సీ మోటర్స్, కైగ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ తదితర సంస్థలు వారి విద్యుత్ ద్విచక్ర వాహనాలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ రామలింగయ్య, డీఓ దిలీప్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభలకు అనుమతి తప్పనిసరి

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా చేపడితే చర్యలు తప్పవని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లాలో ఎక్కడైనా సరే సభలు, సమావేశాలు, ధర్నాలు ర్యాలీలు నిర్వహించాలంటే రాతపూర్వకంగా పోలీసులకు తెలియజేసి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఇతర వర్గాలను, కులాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ప్రసంగాలు చేస్తే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పచ్చమూకలపై ప్రజాగ్రహం

పచ్చమూకల దాడిపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు సృష్టించిన అల్లర్లపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. చంద్రబాబు కుట్రపూరిత వ్యవహారశైలిపై ఆందోళన ఆకాశాన్నంటింది. శనివారం జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన బంద్‌కు అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు లభించింది. శాంతియుతంగా నిర్వహించిన పాదయాత్రలు.. ర్యాలీల్లో ప్రజానీకం స్వచ్ఛందంగా పాల్గొంది. అధికారదాహంతో రాయలసీమలో ఫ్యాక్షన్ సంస్కృతికి పునరుజ్జీవం పోస్తున్న టీడీపీ అధినేతపై మండిపడింది.

- జిల్లా బంద్ విజయవంతం
- శాంతియుతంగా నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పూతలపట్టులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు



చంద్రగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మానవహారం

సాక్షి, చిత్తూరు : జిల్లాలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం పుంగనూరులో చంద్రబాబు ఉసిగొల్పడంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. పచ్చగూండాల పైశాచికత్వానికి మొత్తం 27 మంది పోలీసు అధికారులు, సిబ్బంది గాయపడ్డారు. ఈ క్రమంలో బాధితులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో అన్ని నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ నిరసనలు, ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేపట్టింది. పోలీసులకు మద్దతుగా వైయస్సార్‌సీపీ నిర్వహించిన బంద్‌కు అన్ని వర్గాలవారు స్వచ్ఛందంగా సహకరించారు.

- పుంగనూరులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోలీసులకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.
- చిత్తూరు మార్కెట్ యార్డ్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో, పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో , కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో, పూతలపట్టు కూడలి వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో, నగరి నియోజకవర్గంలో బంద్ నిర్వహించారు. గంగాధర నెల్లూరులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రగిరిలో నిరసన హోరు

చంద్రగిరి(తిరుపతి రూరల్): వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పోలీసులపై టీడీపీ మూకల దాడిపై వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పచ్చ గూండాల చేష్టలను వ్యతిరేకిస్తూ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరిలో భారీ నిరసన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలు చేతబట్టి చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 14 సంవత్సరాల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దిశగా వ్యవహరించడం బాధాకరమన్నారు.

కచ్చితమైన సర్వే చేపట్టాలి



సర్వేకు సంబంధించిన అంశాలను తెలియజేస్తున్న జేసీ బాలాజీ

తిరుపతి అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష రీ సర్వే స్పష్టమైన సమాచారంతో తప్పులు లేకుండా కచ్చితమైన వివరాలతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో పాటు డీటీలు, సర్వేయర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. సర్వేకు సంబంధించి అనుమానాలను నివృత్తి చేశారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. సర్వేపై గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, వెక్టరైజేషన్, ఎఫ్‌పీఓఎల్‌ఆర్, సాదాబైనామా, ఆర్‌ఓఆర్, స్టోన్ ప్లాంటేషన్ తదితర అంశాలపై వర్క్ షాప్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, చంద్రముని, కిరణ్‌కుమార్, జిల్లా సర్వే అధికారి జయరాజ్ పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పురవీధుల్లో ఊరేగుతున్న చెంగల్వరాయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద శనివారం ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పురవిహారానికి బయలుదేరారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థినికి అడ్మిషన్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ మహదేవమ్మ

తిరుపతి సిటీ: 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లు శనివారం నుంచి ప్రారంభమయ్యాయని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.మహదేవమ్మ తెలిపారు. మొదటి ఫేస్ కౌన్సెలింగ్‌లో మెరిట్ విద్యార్థులకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ ఆర్డర్ అందాయని తెలిపారు. తొలిరోజు సుమారు 200 మంది విద్యార్థినులు అడ్మిషన్ పొందినట్లు ఆమె తెలిపారు.

8వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో 2024–25 విద్యాసంవత్సరంలో 8వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. దీనికోసం ఈ ఏడాది డిసెంబర్ 2వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షకు 2011, జూలై 2 నుంచి 2013, జనవరి 1వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

తిరుపతి క్రైం: తిరుపతిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను శనివారం టీవీఎస్ షోరూం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అరెస్ట్ చేసినట్లు తిరుపతి డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు, సేలం జిల్లాకు చెందిన గోవింద పళనిస్వామి గత కొంతకా బుద్ధితో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో బైక్ చోరీలకు పాల్పడేవాడు. ఇలా పలుమార్లు దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఇదే క్రమంలో ఈ ఏడాది జూన్‌లో తిరుపతికి చెందిన ప్రవీణ్‌కుమార్ వాహనాలను చోరీ చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై దర్యాప్తు చేయగా పై విషయాలు బయట పడ్డాయి. ముద్దాయి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పోలీసులకు మంత్రుల పరామర్శ



గాయపడి చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పరామర్శిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కార్పొరేషన్/ చిత్తూరు అర్బన్ : పుంగనూరు ఘటనలో తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, మేయర్ అముద, నగరపాలక కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం పరామర్శించారు.

అదే జగన్‌కు బాబుకు తేడా

ప్రజాసంకల్ప పాదయాత్రను జగనన్న ప్రశాంతంగా ముగించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. అదే బాబు , లోకేష్, పవన్ చేపట్టిన యాత్రల్లో నిత్యం అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అదే జగన్‌కు బాబుకు ఉన్న తేడా అని వెల్లడించారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబును మొదటి ముద్దాయిగా చేర్చాలన్నారు. అధికారదాహంతో అల్లర్లు సృష్టించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు సైతం సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారని వివరించారు.

రాజకీయంగా దివాలా

రాజకీయంగా దివాలా తీయడంతో చంద్రబాబు ఫ్రస్టేషన్‌తో అరాచకాలకు తెగబడుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. పుంగనూరులో అల్లర్లు సృష్టించేందుకే పోలీసులకు ఇచ్చిన రూట్‌మ్యాప్‌ను మార్చుకున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడి చేయించడం చంద్రబాబు రాక్షస ప్రవృత్తికి నిదర్శనమని ఆరోపించారు. కుప్పంలో ఓటమి భయంతో ఇంతటి నీచానికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు ఘటనకు కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు.

పోలీసులపై దాడి సరికాదు

పోలీసులపై దాడి చేయడం సరికాదని విశ్రాంత పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారక్షణే పరమావధిగా విధులు నిర్వర్తించే పోలీసులపై చేసిన దాడికి అల్లరిమూకలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ప్రపంచ సుందరి కిరీటమే లక్ష్యం

- సేవా కార్యక్రమాల్లో ముందుంటా
- స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా సంజన

చంద్రగిరి(తిరుపతి రూరల్): సౌత్ అమెరికాలో జరగనున్న స్టార్ టీన్ గ్లోబ్–2024 ప్రపంచ సుందరి కిరీటం సాధించడమే తన లక్ష్యమని స్టార్ మిస్ టీన్ గ్లోబ్ ఇండియా విజేత సంజన తెలిపారు. చంద్రగిరిలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఇంకా కష్టపడి ప్రపంచ స్థాయికి వెళ్లాలన్నదే తమ ధ్యేయమన్నారు. తన ఎదుగుదలకు తల్లి, బంధువులు, గురువులు, స్థానికులు సాయం చేశారని, వారిని ఎప్పటికీ మరిచిపోనన్నారు. ఏడేళ్ల క్రితం తాను ఒక ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ అని (వికలాంగురాలు) సర్జరీ తర్వాత మోడలింగ్ వైపు దృష్టి సారించినట్లు తెలిపారు. దీనికి తన తల్లి పావని ఎంతో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. తాను మోడలింగ్ వైపు చూస్తూ బెంగళూరులో ఆర్‌వీ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుకుంటున్నానని, ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ డిజైనర్ కోర్సు చేస్తున్నానని తెలిపారు. చదువుకుంటూనే సేవా కార్యక్రమాల వైపు దృష్టిసారిస్తున్నానని చెప్పారు. ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. చంద్రగిరి బాలికల పాఠశాల భవిత కేంద్రంలో ఉన్నవారికి, తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రంలో ఉన్న అక్షయ క్షేత్రానికి, చంద్రగిరిలో ఉన్న వృద్ధాశ్రమానికి పలుసార్లు నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. జంతువులు, పిల్లలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉన్నామని, ఇందుకోసం పలు ఏజెన్సీల కోసం అన్వేషిస్తున్నామన్నారు.

పక్కా ప్రణాళికతోనే పచ్చ గ్యాంగ్ అరాచకం

తిరుపతి కల్చరల్: పుంగనూరులో పచ్చ గ్యాంగ్ చేసిన అరాచకాలు, పోలీసులపై దాడులు పూర్తిగా ముందస్తు పగడ్బంది ప్రణాళికతోనే జరిగాయని ఎమ్మెల్యే డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆరోపించారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంగళగిరి మాంత్రిక కోట నుంచి వదిలిన కుటిల ఆయుధ ఫలితమే ప్రశాంత పుంగనూరులో పచ్చ చొక్కా అరాచక శక్తులు చెలరేగిపోయాయని తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజవర్గంలో శాంతికి, ప్రజా జీవనానికి భంగం కలుగుతోందని, సమన్వయం పాటిస్తున్నారని తెలిపారు. ఎన్ని రెచ్చగొట్టే రాజకీయాలు చేసినప్పటికీ సమన్వయం పాటించిన పుంగనూరు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతులు తెలిపారు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కో చోట అల్లర్లకు ఆజ్యం పోసేందుకు ప్రత్యేక కౌటిల్య టూల్ కిట్ రూపొందించినట్లు తనకు ప్రత్యేక సమాచారం అందినట్లు వెల్లడించారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా అరాచకానికి తెలుగుదేశం గ్యాంగ్ పాల్పడుతోందని ఎమ్మెల్సీ ఆరోపించారు. తెలుగుదేశం నాయకత్వం ఈ సారి కొత్త రాజకీయ ఆయుధాన్ని సృష్టించి, డబుల్ బ్యారెట్ డబుల్ కౌంటర్ కోవర్టు ఆపరేషన్ పుంగనూరులో ప్రయోగించిందన్నారు. శాంతిని కాంక్షించే మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా వాడిన ఈ మాయోపాయ మిస్సైల్ పాకిస్తాన్ ఘోర మిస్సైల్‌లాగా తుస్సుమన్నుందన్నారు. ఇలాంటి కుట్రపూరిత, కుయుక్త రాజకీయాలకు పూర్తి పేటెంట్ హక్కులు తెలుగుదేశం నాయకత్వానివేనని విమర్శించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

యూనివర్సిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధికి ఉద్యోగులందరూ కలసికట్టుగా సహరిస్తామని ఎస్వీయూ ఉద్యోగుల ఐక్యవేదిక స్పష్టం చేసింది. శనివారం ఎస్వీయూ సెనెట్ హాల్‌లో మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణపై ఉద్యోగుల ఐక్యవేదిక సమావేశం నిర్వహించిది. ఈ సమావేశంలో టీచింగ్ అసోసియేషన్ సెక్రటరీ రెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ మురళీ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ వర్సిటీలోని మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం ప్రతిపాధించిదని, ఇందులో మొదటి గేట్, ఎస్ఏఆర్ఎల్ గెస్ట్ హౌస్ రోడ్ల విస్తరణ ప్రతిపాదనకు అంగీకారం తెలిపామన్నారు. మొదటి గేట్ రోడ్డు విస్తరణపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై స్వల్ప మార్పు చేస్తూ ఇండియన్ గ్యాస్ గోడౌన్, స్పోర్ట్స్ బ్లాక్ మధ్యలో వంద అడుగుల రోడ్డును నిర్మించేలా సూచించారని తెలపారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే భవనాలను నూతనంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నాన్‌టీచింగ్, అకడమిక్ కన్సల్టెంట్, ఎన్ఎమ్ఆర్, హాస్టల్ ఎన్ఎమ్ఆర్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ నగర పాలక సంస్థ ప్రతిపాధించిన రోడ్ల విస్తరణకు తాము పూర్తి మద్దతును తెలియజేస్తున్నామన్నారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు టీఎంఆర్ రాజు, అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే కిషోర్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ ఐఎస్ కిషోర్, నాన్ టీచింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, విమెన్ రెప్రెజెంటేటీవ్ కుమారి, ఎన్ఎమ్ఆర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకేపాటి శివానందరెడ్డి, హాస్టల్ ఎన్ఎమ్ఆర్ అధ్యక్షులు గౌతమి, సెక్రటరీ లోకేష్, టైమ్ స్కేల్ ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.సయ్యద్‌సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు తమ పూర్తి బయో డేటాతో పాటు క్రీడల్లో పాల్గొన్న సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను ఈ నెల 11వ తేదీలోపు అందించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను చీఫ్ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి అనే చిరునామాకు పంపించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 91777 96469నంబరులో సంప్రదించాలన్నారు.